రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించాలి

- డీఈవో డీ మాధవి

విజేతల వివరాలను వెల్లడిస్తున్న డీఈవో డీ మాధవి

పెద్దపల్లి కమాన్, జనవరి 23 : రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు రాణించాలని డీఈవో డీ మాధవి సూచించారు. జిల్లా స్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతల వివరాలను డీఈవో మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు. ఈ వారంలో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక పోటీలు ఆన్ లైన్‌లో నిర్వహిస్తారని తెలిపారు. సమాజం కోసం శాస్త్ర సాంకేతికత ప్రధాన అంశంగా, ఐదు ఉప అంశాల్లో జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థులు వివరాలను వెల్లడించారు. వివిధ విభాగాల్లో సీహెచ్ ఓంకార్, బి. రఘునాథ్, డీ రిషి టీ విక్రమ్, ఎస్. పూర్ణచందర్, కే అజిత్ రాజ్, జీ సాయితేజ, ఆర్ కీర్తన, టీ సాయివర్షిత, ఎస్. విఘ్నేశ్, పీ సురేందర్, పీ శైలజ రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు డీఈవో వివరించారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

గాలన్న చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ రఘువీర్ సింగ్

పెద్దపల్లి, జనవరి23: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్ మంగళవారం పరామర్శించారు. శోభ భర్త గాలన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం వారి స్వగ్రామం సైదాపూర్ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామానికి వెళ్లి గాలన్న చిత్రపటానికి నివాళులర్పించారు. మృతికిగల కారణాలు తెలుసుకోని గాలన్న కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. .

క్యాలెండర్ విడుదల

క్యాలెండర్ విడుదల చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

మంథని, జనవరి 23: యువ జనతా ఫౌండేషన్ -2024 క్యాలెండర్‌ను హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం విడుదల చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డీవో తూము రవీందర్, మంథనిలో ఎడ్ల శ్రీనివాస్ విడుదల చేశారు. వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఫౌండేషన్ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది బుద్ధార్థి నవీన్, న్యాయవాదులు బూడిద మల్లేశ్, ప్రమోద్, ఎడ్ల సుమన్, ఫౌండేషన్ సభ్యులు సంతోష్, పవన్, కృష్ణ కౌశిక్, రాజశేఖర్, పీర్ల నవీన్, శ్రీకాంత్, ఆదర్శ్, సాయి పాల్గొన్నారు.

యువత దేశ భక్తి పెంపొందించుకోవాలి

పెద్దపల్లి టౌన్: నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘాల నాయకులు

పెద్దపల్లి రూరల్: పెద్దబొంకూర్‌లో నేతాజీ సుబాస్ చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దపల్లి టౌన్, జనవరి 23 : నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకొని యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ సూచించారు. నేతాజీ జయంతి సందర్భంగా సుభాష్ నగర్‌లోని బోస్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వివిధ యువజన సంఘాల నాయకులు నివాళులర్పించారు.

మంథని రూరల్, జనవరి23: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ పరాక్రమ దివస్ నిర్వహించారు. స్వాతంత్ర ఉద్యమంలో నేతాజీ పోరాట పటిమను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎండీ తాహేర్ హుస్సేన్, ఐక్యుఏసీ కో ఆర్డినేటర్ కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, అధ్యాపడు ఆరెపల్లి సతీశ్, లైబ్రేరియన్ డాక్టర్ భారత్, అధ్యాపకులు పర్శయ్య, అమర్నాథ్, మానస, రజిత, బోధనేతర సిబ్బంది శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ ,జనవరి23: స్వాతంత్ర సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్, సర్పంచ్ బుర్ర మంగ సదానందం, నాగరాజు, సుధీర్ శర్మ, రిటైర్డ్ టీచర్ మోత్కూరి నారాయణ, యువజన సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జనవరి 22: బీఆర్ఎస్ నాయకుడు మిట్టపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్దబొంకూర్‌లో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవరకొండ జగన్, సీపెల్లి శ్రీనివాస్ చారి, మడుపు కృష్ణమాచారి, బొంగాని వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జనవరి 23 : విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలని ఇండియన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ మాటేటి సంజీవ్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అన్నారు. నేతాజీ జయంతి సందర్భంగా పాఠశాలలో నివాళులర్పించారు. విద్యార్థులు నేతాజీ వేషధారణలో ఆకట్టుకున్నారు.

కమాన్‌పూర్, జనవరి 23: సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కమాన్ పూర్‌లో కాంగ్రెస్ నాయకులు నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జ్యోతినగర్, జనవరి 23: పరాక్రమ్ దివస్‌లో భాగంగా ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం పరీక్ష పే చర్చపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన 100మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూర్యకుమారి బర్మా, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమ్మక్క జాతర ఏర్పాట్లు ప్రారంభం

ఓదెల, జనవరి 23: కొలనూర్ గుట్టలో సమ్మక్క- సారలమ్మ జాతర నిర్వహణకు ఏర్పాట్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ జాతరకు ప్రత్యేకత ఉంది. 48 సంవత్సరాల క్రితం ఇక్కడ స్వయంభూగా వెలసినట్లు భక్తులు విశ్వసిస్తారు. జాతర స్థలం కూడా రైల్వే స్టేషన్‌కు సమీపంలో చుట్టూ గుట్టలు ఉండి చెరువు, చెట్లతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక్కడికి మహారాష్ట్రతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రైళ్లు, ప్రత్యేక వాహనాల్లో వస్తుంటారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధి హామీ కూలీలతో జాతర ఆవరణలో భూమిని చదును చేసే పనులు ప్రారంభించారు. సమ్మక్క జాతర జరిగే స్థలంలో పిచ్చి మొక్కలను కూలీలతో తొలగిస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- పెద్దపల్లి బల్దియా చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి

పెద్దపల్లి: టాస్ వేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ డా. దాసరి మమతారెడ్డి

పెద్దపల్లి, జనవరి23: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని పెద్దపల్లి బల్దియా చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం ప్రారంభించారు. మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్స్ మధ్య నిర్వహించిన మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ ఆకుల వెంకటేశ్, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

కాల్వశ్రీరాంపూర్, జనవరి23: మండలంలోని రాయపేట ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే విజయరమణారావు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యేగా విజయ రమణారావు విజయం సాధించాలని మేకల జనార్దన్‌రెడ్డి గతంలో మొక్కుకున్నారు. విజయరమణారావు సమక్షంలో జనార్దన్ రెడ్డి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఇక్కడ మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఎంపీటీసీ సదానందం, భూంరెడ్డి ఉన్నారు.

గని ప్రమాద స్థలం పరిశీలన

గోదావరిఖని, జనవరి 23: సింగరేణి ఆర్జీ-1 జీడీకే-2ఏ గనిలో సోమవారం జరిగిన గని ప్రమాదంలో మైనింగ్ సర్దార్ సమ్మిరెడ్డి తీవ్ర గాయపడ్డాడు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు ఆరెల్లి పోచం, వెంకటరెడ్డి, పర్లపల్లి రామస్వామి, నాగేందర్, మైనింగ్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, అధికారులతో కలిసి మంగళవారం గనిలోకి దిగి ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. సరైన రక్షణ చేపట్టకపోవడంతో ప్రమాదం జరిగిందని గుర్తించారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా యాజమాన్యం రక్షణ చర్యలు చేపట్టి కార్మికుల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ధర్మారం, జనవరి23 : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని కొత్తూరు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కొలుముల దామోదర్ యాదవ్ ప్రోత్సాహంతో ధర్మారం మోడల్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఫౌండేషన్ సభ్యుడు జంగ మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు ఈ నెల 26న బహుమతులు అందజేస్తా మని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మన్నె దీన, అధ్యాపకులు, పీఈటీలు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు బీమా

గోదావరిఖని, జనవరి 23: సింగరేణి కార్మికులు యూనియన్ బ్యాంకులో ఖాతా కలిగి ఉంటే ప్రమాద బీమా అందిస్తున్నట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు. ప్రమాదవశాత్తు ఎవరైనా కార్మికుడు మరణిస్తే రూ.కోటి ఎక్స్ గ్రేషియా చెల్లించడం, ఏటా కార్మికుడు రూ.306 చెల్లిస్తే అదనంగా మరో రూ.30లక్షలు బీమా చెల్లించేందుకు ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. ఎస్‌బీఐ అధికారులతో కూడా సంప్రదింపులు జరుపుతున్నామని, త్వరలో ఆ వివరాలు కూడా తెలియజేస్తామని కార్మికులు గమనించాలని కోరారు.

కాకర్లపల్లిలో వైద్య శిబిరం

మంథని రూరల్, జనవరి 23: మంథని మండలం కాకర్లపల్లిలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

జీడీకే-2ఏ గని ప్రమాదంపై విచారణ

గోదావరిఖని, జనవరి 23: ఇటీవల సింగరేణి జీడీకే-2ఏ గనిలో జరిగిన ప్రమాదంలో మైనింగ్ సర్దార్ సమ్మిరెడ్డి తీవ్రంగా గాయపడిన సంఘటనపై హైదరాబాద్ డీడీఎంఎస్ వెంకన్న బానోత్ విచారణ చేపట్టినట్లు తెలిపారు. గనుల చట్టం 1952, సెక్షన్ 23 ప్రకారం నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ఈమేరకు మంగళవారం గని కార్యాలయంలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. బుధవారం కూడా విచారణ చేపట్టి సాక్ష్యాలు, స్టేట్‌మెంట్ తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రమాదానికి సంబంధించి ఎవరైనా ప్రత్యక్ష సాక్షులు గానీ సంబంధిత అధికారులుగానీ ఇతర ఉద్యోగులు గానీ లేదా ఆసక్తి గల ఇతర వ్యక్తులు గానీ సాక్ష్యాధారాలను అందించడానికి, వారి అభిప్రాయాలను తెలియజేయడానికి కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

రెండు రేషన్ షాపులు సీజ్

సుల్తానాబాద్ రూరల్, జనవరి 23 : రేగడిమద్దికుంటలోని రెండు రేషన్ షాపులను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. మంగళవారం గ్రామంలోని రేషన్ షాపులను తహసీల్దార్ తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో దాదాపు 44క్వింటాళ్ల బియ్యం వ్యత్యాసం రావడంతో వాటిని సీజ్ చేశామని తహసీల్దార్ తెలిపారు. అల్లీపూర్‌కు రేషన్ షాపులను అప్పగించినట్లు వివరించారు.

ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి వృద్ధురాలి మృతి

లక్ష్మి (ఫైల్)

ధర్మారం, జనవరి 23: మండలంలోని కటికెనపల్లి గ్రామానికి చెందిన మస్కం లక్ష్మి(70) మంగళవారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మరణించింది. ఎస్ఐ టీ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మి ఉదయం గ్రామ శివారులోని తన పొలానికి నీరు పెట్టడానికి వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. కరెంట్ మోటార్ స్విచ్ ఆన్ చేయటానికి వెళ్లి అకస్మాత్తుగా కాలు జారి బావిలో పడి ప్రాణాలు కోల్పోయింది. ఆమె ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడా వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించి పంచనామా చేశారు. లక్ష్మి కొడుకు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పరామర్శ

పెద్దపల్లి టౌన్, జనవరి 23: పెద్దపల్లి బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్ తండ్రి రాజమల్లు మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని మంగళవారం సాయంత్రం మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ పరామర్శించారు. ఇక్కడ నాయకులు కుక్క అశోక్, రమేశ్, శంకర్ ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

సుల్తానాబాద్ రూరల్, జనవరి 23: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీటీసీ శీలం శంకర్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గట్టెపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు.

అవిశ్వాసంపై 3న సమావేశం

సుల్తానాబాద్, జనవరి 23: సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతపై కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాసం తీర్మానంపై ఫిబ్రవరి 3న సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కౌన్సిల్‌లోని సభ్యులకు మంగళవారం నోటీ సులు అందజేశారు. కౌన్సిల్‌లో 15 మంది సభ్యులుండగా, 13వ వార్డు కౌన్సిలర్ సిద్ద కనుకయ్య అనారోగ్యంతో చనిపోయాడు. మిగితా 14 మందిలో 11 మంది సునీతపై అవిశ్వాసానికి మద్దతుగా సంతకాలతో కూడిన దరఖాస్తును అదనపు కలెక్టర్‌కు అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

విద్యార్థినులను జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఈవో మాధవి

జూలపల్లి, జనవరి 23 : జూలపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి గణిత శాస్త్ర పోటీలకు ఎంపికయ్యారు. పెద్దపల్లిలోని అమర్‌చంద్ కళ్యాణ మండపంలో టీఎంఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో పిట్టల శ్వేత, గుమ్మడి విఖిత ఉత్తమ చూపి తొలి రెండు స్థానాల్లో నిలిచారు. డీఈవో మాధవి విద్యార్థినులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. నిజామాబాద్‌లో ఈ నెల 29న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వీరిద్దరూ హాజరుకానున్నారు. హెచ్ఎం సరస్వతి, ఉపాధ్యాయులు శ్రీకాంత్‌రెడ్డి, కమల అభినందించారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక

చిత్రకారుడు శ్రీనివాస్ బాబు

ఎలిగేడు, జనవరి 23: '' స్వామి వివేకానంద-సుభాష్ చంద్రబోస్ '' జయంత్యుత్సవాల సందర్భంగా విశ్వకర్మ సేవాఫౌండేషన్, యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రకళా పోటీల్లో ఎలిగేడు గ్రామానికి చెందిన చిత్రకారుడు చెల్లోజు శ్రీనివాస్‌బాబు ''తెలుగు వెలుగు '' జాతీయస్థాయి 'నంది' అవార్డుల పుస్కారానికి ఎంపికైనట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 4న హన్మకొండలోని టీఎన్జీవోల భవనంలో జయంత్యుత్సవాల ముగింపు కార్యక్రమాల సందర్భంగా చెల్లోజు శ్రీనివాస్‌బాబుకు జాతీయస్థాయిలో 'నంది' పురస్కారాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ బాబును గ్రామస్తులు అభినందించారు.

మహిళా కార్మికురాలిపై దూసుకెళ్లిన కారు

జ్యోతినగర్, జనవరి 23: ఎన్టీపీసీ టౌనషిప్‌లో ఓ మహిళా కాంట్రాక్ట్ కార్మికురాలిపై మంగళవారం ఓ కారు దూసుకెళ్లింది. సంబంధిత కాంట్రాక్టర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీపీసీ న్యూ పీకే రామయ్యకాలనీకి చెందిన కుంతి టౌన్‌షిప్‌లో సివిల్ పనులు చేస్తున్నది. భోజన విరామ సమయంలో సెయింట్‌క్లేర్ పాఠశాలలో చెట్లకింద భోజనం ముగించుకొని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో యైటింక్లయిన్‌కాలనీకి చెందిన ముగ్గురు పూర్వ విద్యార్థులు కారులో పాఠశాల లోపలికి వేగంగా వచ్చి మహిళా మీదుగా కారును ఎక్కించారు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కాడంతో స్పృహ కోల్పోయింది. సూపర్‌వైజర్ కార్మికురాలిని గోదావరిఖనిలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

రిటైర్డు ఉద్యోగుల ఏరియర్స్ చెల్లింపులపై సమీక్ష

రామగిరి,జనవరి 23: సింగరేణి రిటైర్డు ఉద్యోగులకు 11వ వేతన ఒప్పంద బకాయిల చెల్లింపుపై పర్సనల్ జీఎం హనుమంత రావు సమీక్షించారు .ఈ మేరకు జీఎం కార్యాలయంలో మంగళవారం అన్ని ఏరియాల పర్సనల్ విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన వేతనాలను అందజేయడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అందుకు సంబంధించి అర్హత, నిబంధనలు సరి చూసుకోవాలని, త్వరగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పీఎం రవీందర్ రెడ్డి, సీనియర్ పీవో రాజేశం, సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ ఉన్నారు.

ధర్మారంలో వైద్య శిబిరం

ధర్మారం,జనవరి 23: కరీంనగర్‌కు చెందిన సన్ షైన్ దవాఖాన ఆధ్వర్యంలో ధర్మారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేయగా, సర్పంచ్ పూస్కూరు జితేందర్ రావు ప్రారంభించారు. సుమారు 200 మందికి వైద్య సిబ్బంది పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, మేనేజర్ వంశీ, శిబిరం ఇన్‌చార్జి ఒల్లాజి అనిల్, వైస్ ఎంపీపీ మేడవేని తిరుపతి, ఉప సర్పంచ్ ఆవుల లత, నాయకులు బొల్లి స్వామి, దేవి రాజ లింగయ్య పాల్గొన్నారు.

సమ్మక్క జాతర నిర్వహణపై నేడు సన్నాహక సమావేశం

కోల్‌సిటీ, జనవరి 23: గోదావరిఖని శివారులోని నది వద్ద ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణపై బుధవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్ రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, నగర మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ అభిషే క్‌రావుతో పాటు కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ, జెన్‌కో, ట్రాన్స్‌కో, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, మత్స్య, రెవెన్యూ తదితర శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా జాతర వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్ల అంశం పై అన్ని పరిశ్రమలు, విభాగాల అధికారులను సమన్వయం చేయడానికి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 23: అప్పు ఇచ్చిన వారు డబ్బుల అడగడంతో మనస్తాపం చెందిన ఓ మహిళ గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. దవాఖానలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. గోదావరిఖని వన్ టౌన్ ఎస్ఐ స్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిలక్‌నగర్‌కు చెందిన మణమ్మ (39) తన చిన్న కూతురు వివాహ సమయంలో రూ.10లక్షలు గౌతమినగర్‌కు చెందిన కొమురయ్య నుంచి అప్పుగా తీసుకుంది. కొమురయ్య అతని కుటుంబ సభ్యులు సోమవారం మణమ్మ ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వాలని అడిగారు. దీంతో ఆంతో మనస్తాపం చెందిన మణమ్మ ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు గోదావరిఖని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా చికిత్సపొందుతూ మృతిచెందింది.పెద్ద కూతురు అశ్విత ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

ధర్మారం, జనవరి 23: తమతో కలిసి చదువుతున్న మిత్రురాలి భర్త అనారోగ్యంతో బాధపడు తుండగా వైద్య ఖర్చుల కోసం తోటిస్నేహితులు సాయం చేసి అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన కైలాస రూపారాణి భర్త రాజు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న రూపారాణి మిత్రులు తలా కొంత పొగు చేసి రూ.23 వేలు మంగళవారం వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఇక్కడ ఓరెం చిరంజీవి, కాల్వ తిరుపతి, కొత్తకొండ సత్యనారాయణ, గంధం రాజయ్య, బద్రి మధుసూదన్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

కాల్వశ్రీరాంపూర్, జనవరి23: రాబోయే పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని తహసీల్దార్ జాహెద్‌పాషా ఉపాధ్యాయులకు సూచించారు. పెగడపల్లి, తారుపల్లి ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. సమయపాలన పాటించి విద్యార్థులకు గుణాత్మక బోధన చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. ఇక్కడ గిర్దావర్ ఉదయశ్రీ, ఆయా పాఠశాలల హెచ్ఎం లు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

పేదల భూ సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లి టౌన్, జనవరి 23: రాష్ట్రంలోని పేదల భూ సమస్యలను పరిష్కరించాలని హైకోర్టు న్యాయవాది సాధిక్ అలీ డిమాండ్ చేశారు. ఎన్ఎస్ గార్డెన్‌లో సాధిక్ ఫౌండేషన్, పద్మ-హనుమయ్య ఫౌండేషన్ , వాయిస్ ఆఫ్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం భూసమస్యల సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాధిక్ అలీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీ కాలయాపన చేయకుండా వెంటనే భూసమస్యలు పరిష్కరించాలని కోరారు. సాదాబైనామా దరఖాస్తులు ఇప్పటికే దాదాపు ఏడు లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. హైకోర్టు తీర్పును గౌరవించని నవీన్‌మిట్టల్‌ను మరో శాఖకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, నాయకులు దాసరి పద్మ, గూళ్ల రాజు, డీవీఎస్ మూర్తి, సిరవేన స్వప్న, కట్ల మల్లేశ్, రాంపల్లి దుర్గయ్య పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి ప్రమాదాలను నివారించాలి

సుల్తానాబాద్, జనవరి 23 : ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు పాటుపడాలని పెద్దపల్లి ఎంవీఐ సిరాజ్ ఉర్ రహమాన్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా సుల్తానాబాద్‌లోని డీసీఎం వ్యాన్ డ్రైవర్స్, ఓనర్స్ అసోయేషన్ సభ్యులతో మంగళవారం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఎంవీఐ సిరాజ్ మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవర్లు మద్యానికి దూరంగా ఉండాలన్నారు. మద్యం తాగి ఎంతో విలువైన మీ ప్రాణాలు పోగొట్టుకొని కుటుంబ సభ్యులు రోడ్డున పడేయవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ఇంటర్‌నెట్ సెంటర్ నిర్వాహకుడు అదృశ్యం

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 23: విఠల్‌నగర్‌కు చెందిన ఇంటర్‌నెట్ సెంటర్ నిర్వాహకుడు మహ్మద్ నజిముద్దీన్ అనే ఇ